క్లుప్తంగా

మాధవ్‌ను కలిసిన నేతలు



నెల్లూరు రూరల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జిల్లా నేతలు రాజేశ్వరి, సురేష్‌రెడ్డి, ఇండ్ల రాఘవేంద్ర తదితరులు మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలను తెలియజేశారు.

కార్మికులు, ఉద్యోగుల ధర్నా



నెల్లూరు(అర్బన్): దేశవ్యాప్త కార్మిక సమ్మెకు మద్దతుగా నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో ఉద్యోగులు, కార్మికులు ధర్నాను బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా యునైటెడ్ మెడికల్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్ మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే ఆప్కాస్, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కమ్మటి శ్రీనివాసులు, సందానీబాషా, కార్యవర్గ సభ్యులు రాజీవ్‌రెడ్డి, విజయ, పెంచలయ్య, మనోజ్‌కుమార్, సామెల్, మోహన్‌రాజు, యానాదిశెట్టి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటాం



సీపీఎం నేతల నిరసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ నగరంలోని 26వ డివిజన్లో నిరసనను సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మాలకొండారెడ్డినగర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. వీటిని ఏర్పాటు చేస్తే పగలగొట్టాలని గతంలో పిలుపునిచ్చిన టీడీపీ, ప్రస్తుతం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పార్టీ రూరల్ నేతలు రఫీ అహ్మద్, రాజా, గౌస్‌పీర్, పోలయ్య, జాకీరా పాల్గొన్నారు.

మాదిగల అభివృద్ధికి ప్రభుత్వ కృషి



మాట్లాడుతున్న శ్రీదేవి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాదిగల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి పేర్కొన్నారు. నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో విలేకరులతో బుధవారం ఆమె మాట్లాడారు. దళితులకు విద్య, ఉపాధి అవకాశాలు మరింతగా రావాలని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రొట్టెను స్వీకరించి..

నెల్లూరు(బారకాసు): బారాషహీద్ దర్గాను మాదిగ సంక్షేమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి దర్శించుకున్నారు. అనంతరం స్వర్ణాల చెరువులో ఆరోగ్య రొట్టెను స్వీకరించారు. తొలుత ముజావర్లు ఆమెకు ఘన స్వాగతం పలికారు.

కన్యకాపరమేశ్వరికి 11న గోరింటాకు అలంకారం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు గోరింటాకు అలంకారంలో శుక్రవారం దర్శనమివ్వనున్నారని దేవస్థాన పాలకమండలి కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, అధ్యక్షుడు కోట గురుబ్రహ్మం తెలిపారు. ఆహ్వాన పత్రికలను బుధవారం ఆవిష్కరించిన అనంతరం విలేకరులతో వారు మాట్లాడారు. శాకంబరి అలంకారంలో ఈ నెల 18న దర్శనమివ్వనున్నారని వివరించారు. గౌరవ సలహాదారుడు ఆంజనేయులు, కోశాధికారి ఉమ్మెన జనార్దన్, కమిటీ సభ్యులు పాబోలు సత్యనారాయణ, హజరత్ బాబు ప్రధానార్చకుడు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

⇨ రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శాకంబరిగా శుక్రవారం దర్శనమివ్వనున్నారని ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

వేడుకగా గురుపూర్ణిమ మహోత్సవాలు





నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ సమీపంలోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో గురుపూర్ణిమ మహోత్సవాలను బుధవారం ప్రారంభించారు. ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానం నుంచి శ్రీరామచంద్రుడు, సీతా, లక్ష్మణ హనుమత్ సమేతుడై భక్తజన సపరివారంగా మందిరానికి చేరుకున్నారు. విష్వక్సేన పూజ, కలశస్థాపన, నవగ్రహ మండపారాధన, సీతారామచంద్రులవారికి పూజ తదితరాలను దేవస్థాన వేదపండితుడు కృష్ణస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉభయకర్తలుగా కురిచేటి లక్ష్మీనారాయణరావు, వెంకటనాగమణి దంపతులు వ్యవహరించారు. మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి, గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య తదితరులు పర్యవేక్షించారు.

దర్గా ప్రాంగణంలో కమిషనర్ పరిశీలన



నెల్లూరు(బారకాసు): స్వర్ణాల చెరువు వెంబడి ఘాట్లలో పారిశుధ్య పనులను కమిషనర్ నందన్ బుధవారం పర్యవేక్షించారు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల్లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. రొట్టెలు మార్చుకునే సమయంలో లోతైన ప్రాంతానికి వెళ్లకుండా సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. ఘాట్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది 24 గంటలూ పర్యవేక్షిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు.

• వీఆర్ మున్సిపల్ పాఠశాల నిర్వహణను కమిషనర్ నందన్ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని తిని ఆహార నాణ్యతను పర్యవేక్షించారు. విద్యార్థులకు అవసరమైన యూనిఫారం, స్కూల్ బ్యాగ్, షూస్ తదితర విద్యా సామగ్రిని అందజేయాలని కోరారు.

ప్రసన్న ఇంటిపై దౌర్జన్యకాండ హేయం



మాట్లాడుతున్న నిర్మల

నెల్లూరు (పొగతోట): మాజీ మంత్రి, ఆరుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి మహిళలపై అపార గౌరవముందని, ప్రతి మహిళనూ అమ్మ అని పిలుస్తారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లి నిర్మల పేర్కొన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డికి నగరంలోని ఆయన నివాసంలో సంఘీభావం తెలిపిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇంటిపై దాడులు చేసి గందరగోళం సృష్టించారని ఆరోపించారు. రాజకీయాల్లోకి వస్తే పూలు.. రాళ్లు పడుతుంటాయని, సహించి ఓర్పుగా ఉండాలని హితవు పలికారు. గత ఎన్నికల్లో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అనుచరుడు తనపై వివాదాస్పద వ్యాఖ్య చేశారని, అప్పుడు మహిళనే విషయం గుర్తుకురాలేదానని ప్రశ్నించారు. పోలీస్ అధికారులపై పూర్తిస్థాయిలో నమ్మకం ఉందని, కారకులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయాలని కోరారు. దాడి జరిగిన ఏడో తేదీని బ్లాక్ డేగా అభివర్ణించారు. మీ తల్లి ఉన్న ఇంట్లో ఇదే విధంగా ఎవరైనా దౌర్జన్యానికి పాల్పడితే ఏమి చేస్తారని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ప్రశ్నించారు. అనంతరం పార్టీ నేత సంపూర్ణమ్మ మాట్లాడారు. గతంలో మంత్రులు రోజా, రజనిలపై తప్పుడు కూతలు కూశారని ఆరోపించారు. ప్రసన్న ఉంటే హత్య చేసేందుకు ముందుగానే సిద్ధపడి మారణాయుధాలతో వచ్చారన్నారు. పార్టీ బుచ్చిరెడ్డిపాళెం నేత సునీత, కోవూరు జెడ్పీటీసీ శ్రీలత, మాజీ కార్పొరేటర్ వెంకటజ్యోతి, షకీలాబేగం, పార్టీ జిల్లా మహిళాధ్యక్షురాలు లక్ష్మీసునంద తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భవన్ ఎదుట ధర్నా



నెల్లూరు(వీఆర్సీసెంటర్): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా నగరంలోని విద్యుత్ భవన్ వద్ద ధర్నాను యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు మాట్లాడారు. విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల 8న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు హజరత్తయ్య, జాకీర్ హుస్సేన్, బొజ్జా సుమన్, పెంచలప్రసాద్, నాగయ్య, హరినారాయణ, విజయరామిరెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి, మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

• భోజన విరామ సమయంలో విద్యుత్ భవన్ వద్ద నిరసనను విద్యుత్ ఇంజినీర్స్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈఈలు లక్ష్మీనారాయణ, బాలచంద్ర, సుధాకర్, శ్రీధర్ పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



మాట్లాడుతున్న ఆనంద్

• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (పొగతోట): స్వయం సహాయక గ్రూపు మహిళలు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆనంద్ కోరారు. బుధవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో వార్షిక రుణ, జీవనోపాధి కార్యాచరణ ప్రణాళికపై నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు గ్రూపుల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గ్రూపు సభ్యుల డేటా పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. రుణాల చెల్లింపులను వంద శాతం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రూపు సభ్యులకు రుణ పరిమితిని పెంచి జీవన ప్రమాణాలు పెంచేందుకు మైక్రో క్రెడిట్ ప్లాన్‌ను సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయం, పశు సంవర్ధక శాఖ, మత్స్యశాఖ ఆధ్వర్యంలో రైతులు, మత్స్యకారులు, పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులను విరివిగా అందించాలన్నారు. ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమను క్రమబద్ధీకరణ పథకం ద్వారా రెడీ టు ఈట్, రెడీ టు కుక్ పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు. ఈ యూనిట్ల స్థాపనపై స్వయం సహాయక మహిళలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను గుర్తించి పథకం ద్వారా రుణాలు మంజూరు చేయించాలని, గ్రూపు మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీ నిధి రుణాలు సకాలంలో మంజూరు చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంతకు ముందు లబ్ధిదారులకు సబ్సిడీపై కేటాయించిన పిండిమిల్లు, చపాతి తయారీ యంత్రాలు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల యూనిట్లను కలెక్టర్ పరిశీలించారు. డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి, ఎల్డీఎం మణిశేఖర్, నాబార్డు డీడీఎం బాబు, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, పశు సంవర్ధక శాఖ జేడీ రమేష్‌నాయక్, మత్స్యశాఖ అధికారి చాన్‌బాషా, జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, బ్యాంకు అధికారులు, డీఆర్‌డీఏ ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు



నెల్లూరు(బృందావనం): కామ్యహోమ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా మూలాపేటలోని శంకరమఠంలో దక్షిణామూర్తి, మన్యుసూక్త, శత్రు పరాయజ హోమాలు, గురుసహస్రనామ పూజలను బుధవారం నిర్వహించారు. మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

వాటర్ ప్లాంట్ పునరుద్ధరణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాటర్ ప్లాంట్‌ను స్టేడియం మహిళా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వసుంధర, కుమార్తె రాధిక నేతృత్వంలో బుధవారం పునరుద్ధరించారు. రూ.లక్ష వెచ్చించి వీటిని పునరుద్ధరించిన వీరికి పలువురు కృతజ్ఞతలను తెలియజేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి, డీఎస్డీఓ యతిరాజ్, స్టేడియం వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బాసం శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

టీచర్లను పూర్తిస్థాయిలో ఎందుకు నియమించలేదు..?

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను పూర్తి స్థాయిలో ఎందుకు నియమించలేదో విద్యాశాఖ అధికారులు సమాధానం చెప్పాలని పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరహరి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటుకు భావించిన ప్రభుత్వం ముందుగానే డీఎస్సీని ఎందుకు నిర్వహించలేకోపోయిందో చెప్పాలని కోరారు.

బ్యాంకింగ్ రంగం ప్రైవేటీకరణ తగదు



నెల్లూరు(అర్బన్): బ్యాంకింగ్, ఇన్సురెన్స్ రంగాన్ని ప్రైవేటీకరించడం తగదని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఏపీజీబీ ఆఫీసర్స్ అసోసియేషన్, బ్యాంకింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో విధులను ఉద్యోగులు బహిష్కరించి వెంకట్రామాపురంలోని ఏపీజీబీ రీజినల్ కార్యాలయం వద్ద ఆందోళనను బుధవారం నిర్వహించారు. కేంద్రం ఇప్పటికైనా తమ పద్ధతులను మార్చుకోకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. ఎంప్లాయీస్ యూనియన్ రీజినల్ సెక్రటరీ లియాఖత్ అలీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ రోగులకు నాణ్యమైన వైద్యమందించాలి



మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని టీబీ రోగులకు నాణ్యమైన వైద్యసేవలందించాలని ఏడీఎంహెచ్‌ఓ, జిల్లా టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ పేర్కొన్నారు. జిల్లాలోని క్షయ నివారణ సిబ్బందితో బీవీనగర్‌లోని డీఎఫ్ఐటీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షల్లో టీబీ నిర్ధారణైతే రోగులకు ధైర్యం చెప్పాలన్నారు. మందులను సక్రమంగా మింగేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

హెపటైటిస్ నుంచి కాలేయాన్ని కాపాడుకుందాం

నెల్లూరు(అర్బన్): హెపటైటిస్ నుంచి లివర్‌ను కాపాడుకుందామని చెన్నై గ్లినిగల్ ఆస్పత్రికి చెందిన లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జన్ రజనీకాంత్ పేర్కొన్నారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని హెపటైటిస్‌తో వచ్చే వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని సండే మార్కెట్ సమీపంలోని గ్లినిగల్ క్లినిక్‌లో బుధవారం నిర్వహించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. వ్యాధి రాకుండా ఉండేందుకు వ్యాక్సిన్‌ను మూడు డోసులు వేయించుకోవాలని కోరారు. 50 మంది నెల్లూరీయులకు ఇప్పటి వరకు లివర్ మార్పిడి చేశానని చెప్పారు. నెల్లూరులో ప్రతి నెలా మొదటి గురువారాన లివర్‌కు సంబంధించిన చికిత్సను అందిస్తున్నామని వివరించారు. మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు సిటీ: జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిని చింతారెడ్డిపాళెంలోని వారి నివాసంలో పార్టీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జయకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. నేతలు నవీన్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పేరెంట్, టీచర్ మీటింగ్ నేడు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని 3,422 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం పేరెంట్, టీచర్ సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాధించిన విజయాలను హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్సులో ప్రగతి నివేదికను అందజేయనున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్, రంగోలి వంటి ఆటల పోటీలను నిర్వహించనున్నారు. ప్రతి విద్యార్థికి ఒక మొక్కను అందజేసి వారి పరిసరాల్లో నాటే విధంగా చర్యలు చేపట్టనున్నారు.

పోలీసుల పటిష్ట బందోబస్తు



చిన్నారిని తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగలో నేరాలు జరగకుండా పోలీస్ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. ముగ్గురు జేబు దొంగలను సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి ఐదు మొబైల్ ఫోన్లు, రెండు పర్సులను స్వాధీనం చేసుకొని నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తప్పిపోయిన చిన్నారులను సంరక్షించి కుటుంబసభ్యులకు అప్పగించారు. వృద్ధులు, దివ్యాంగులను దగ్గరుండి దర్గా సందర్శన, రొట్టెల మార్పిడి చేయించారు. పండగ ముగిసేంత వరకు విధులను అప్రమత్తంగా నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు.

వేడుకగా ఉత్తర గోగ్రహణం




నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా చప్పరోత్సవం, ఉత్తర గోగ్రహణం తదితర పూజా కార్యక్రమాలను ప్రధానార్చకుడు చక్రపాణి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఉభయకర్తలుగా శ్రీనివాసులు, సునీత, హర్ష, పోలుబోయిన కోటమ్మ, రూప్‌కుమార్‌యాదవ్, దయాకర్, ప్రవంతి, స్నిగ్ధ, రాహుల్ తదితరులు వ్యవహరించారు. ఈఓ జానకి తదితరులు పర్యవేక్షించారు.

భక్తులకు యూత్ రెడ్‌క్రాస్ సేవలు



నెల్లూరు(అర్బన్): బారాషహీద్ దర్గా వద్ద నిర్వహిస్తున్న రొట్టెల పండగకు వస్తున్న భక్తులకు యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వలంటీర్లు సేవలను బుధవారం అందించారు. స్నానాల ఘాట్ల వద్ద స్వల్ప గాయాలైన పిల్లలు, వృద్ధులను అక్కడి ప్రాథమిక చికిత్స కేంద్రాలకు తీసుకొచ్చి వైద్యసేవలందేలా చేశారు. డాక్టర్లు రంజని, రమాదేవి, ప్రియాంక, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డి సేవలు ఎనలేనివి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో ఏళ్లుగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన సుబ్బారెడ్డి సేవలను ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ కొనియాడారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం సుబ్బారెడ్డి దంపతులను సత్కరించారు.